RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:76 | ఫిబ్రవరి 28, 2026 | వెల: రూ.3-00

## అవినీతి.. అరాచకం..

**ఇవే కాంగ్రెస్ పాలన జోడెడ్లు**

- మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగురుతుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆలంపూర్ విజేతలకు ఘన సన్మానం




2లో

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**మాట తప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే**

- రైతు భరోసా నిధుల విడుదల చేయాలి
- నిధులు జమ చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన
- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ




2లో

## సాక్ష్యాలు లేవని మాత్రమే కోర్టు చెప్పింది క్లీన్ చిట్ కాదు

- ఢిల్లీ మద్యం కేసు తీర్పుపై ఎంపీ ధర్మపురి అరవింద్
- బీజేపీ రాజకీయ డ్రామా: జగ్గారెడ్డి

2లో




# చీట్‌ఫండ్స్!

## శృతి మించిపోతున్న ప్రైవేట్ చిట్స్ ఆగడాలు

### పేద, మధ్యతరగతి ప్రజల ఆశలు నిలువు దోపిడీ..

2లో

- మాయమాటలతో వల.. తీరా డబ్బు అడిగితే చుక్కలు
- కష్టపడి దాచుకున్న సొమ్ము మాయగాళ్ల పాలు
- నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా అందని డబ్బు
- షురిటీల పేరుతో కొర్రీలు..
- చిట్టీ టర్మ్ ముగిసినా డబ్బివ్వకుండా దాగుడుమూతలు
- పేదల చిట్టీ డబ్బులతో రియల్ వ్యాపారం
- డబ్బివ్వమంటే పనికి రాని ప్లాట్లు అంటగడుతున్న వైనం

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

భవిష్యత్తు అవసరాల కోసం, ముఖ్యంగా పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం రూపాయి రూపాయి కూడబెట్టుకున్న సామాన్యుడి నమ్మకాన్ని ప్రైవేట్ చిట్ ఫండ్ సంస్థలు నిలువునా వంచన చేస్తున్నాయి. పొదుపు పేరుతో ఆకర్షణీయమైన వల విసిరి, అమాయక ప్రజలను తమ చిట్టీలలో చేర్చుకుంటున్న ఈ సంస్థలు, తీరా అవసరానికి డబ్బులు అడిగే సమయానికి మాత్రం అసలు రూపాన్ని బయటపెడుతున్నాయి. నమ్మిన వారిని నట్టేట ముంచుతూ, అత్యవసర సమయాల్లో చేతులెత్తేస్తూ, సామాన్యుల కుటుంబాల్లో కన్నీళ్లను మిగుల్చుతున్నాయి. అడ్డగోలుగా వెలుస్తున్న ఈ ప్రైవేట్ చిట్ ఫండ్ సంస్థలు ఇప్పుడు ఒక మాఫియాగా మారి, చట్టం కళ్లు గప్పి వేల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును రియల్ ఎస్టేట్ దందాల్లోకి మళ్లిస్తున్నాయి. చిట్టీ గడువు ముగిసినా సరే, షురిటీల పేరుతో కొర్రీలు పెట్టడం లేదా నగదుకు బదులు అమ్ముడుపోని ప్లాట్లను అంటగట్టడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకుని సాగుతున్న ఈ దోపిడీపై ఉక్కుపాదం మోపాలని, సామాన్యుడి కష్టార్జితానికి రక్షణ కల్పించాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## న్యాయవ్యవస్థపై నమ్మకం నిలిచింది



2లో

### రాజకీయ కక్షతో కేసు పెట్టారు

- కష్టకాలంలో అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు
- మరింత ఉత్సాహంతో ప్రజాసేవకు సంకల్పం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

న్యాయవ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తాను మొదట్నుంచి కడిగిన ముత్యంలా బయటికి వస్తానని తెలంగాణ ప్రజలకు చెప్పానని, అదే నిజమైందని పేర్కొన్నారు. ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని ఎన్నోసార్లు స్పష్టం

మిగతా 2వ పేజీలో...

## మావోయిస్టు కీలక నేతల లొంగుబాటు.. అసెంబ్లీలో ప్రకటన చేస్తాం

- మిగతావారు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తుపాకీ సిద్ధాంతం నడవదు : దేవ్‌జీ
- సచివాలయంలో మాజీ అగ్రనేతల భేటీ



2లో

వేద న్యూస్



## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాట తప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే
- రైతు భరోసా నిధుల విడుదల చేయాలి
- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

సీఎం రేవంత్ రెడ్డికు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బహిరంగ లేఖ రాశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆ లేఖలో విమర్శించారు. ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసి, ఆ తరువాత మాట తప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తికాగానే రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని ఫిబ్రవరి 4న మిర్యాలగూడలో ముఖ్యమంత్రి ప్రకటించారని, అయితే ఇప్పటి వరకు నిధులు జమ కాలేదని నిలదీశారు. లక్షలాది మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మూడో విడతతో కలిపి రూ.27 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా నిధులను తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ, ఆలస్యం చేస్తే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం మాట తప్పితే రైతుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. అలాగే పేదల ఇళ్ల కూల్చివేతల విషయంలో ప్రభుత్వం ఉత్సాహం చూపుతోందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించే ధైర్యం ప్రభుత్వానికి లేదని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

## కవితకు కోర్టులో న్యాయం..

**కేసులన్నీ వీగిపోతాయ.. లిక్కర్ కేసు కట్టుకథ**

**రాజకీయంగా దెబ్బతీయాలనే ప్రయత్నమని విమర్శ**

**చివరికి న్యాయమే గెలుస్తుందన్న ధీమా**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఢిల్లీ లిక్కర్ కేసులో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కోర్టులో న్యాయం జరిగిందని, ఇదే విధంగా తమ పార్టీ నేతలపై పెట్టిన ప్రతి అక్రమ కేసు కూడా వీగిపోతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. లిక్కర్ స్కాం అనే కట్టుకథతో ఢిల్లీ ప్రభుత్వాన్ని కూల్చేశారని, అదే కథనాన్ని అడ్డం పెట్టుకుని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను రాజకీయంగా నష్టపరిచారని కేటీఆర్ ఆరోపించారు. కల్పిత ఆరోపణలతో సృష్టించిన కేసు ద్వారా పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నించారని విమర్శించారు. అయితే కోర్టులో కవితకు న్యాయం జరిగిందని, ఇదే స్ఫూర్తితో ఇతర కేసులూ కూలిపోతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం కొనసాగుతూనే ఉంటాయని కేటీఆర్ అన్నారు. ప్రధాన పార్టీల ఆరోపణలకు మీడియా ట్రయల్స్ తోడై పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఆధారాల కన్నా ఆరోపణలకే ప్రాధాన్యం ఇస్తున్న కొత్త ధోరణి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎంత దుష్ప్రచారం చేసినా చివరికి న్యాయమే గెలుస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. తమపై మోపిన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమని, అవి త్వరలోనే అవాస్తవాలని తేలిపోతాయని ధీమా వ్యక్తం చేశారు.

## కోర్ అర్బన్ ప్రాంతాల్లో పారిశుధ్యానికి అత్యధిక ప్రాధాన్యం

- సాంకేతిక అనుసంధానంతో స్ట్రీట్ లైటింగ్ పర్యవేక్షణ
- ఆహార నాణ్యత, అగ్నిమాపక భద్రతపై కఠినంగా ఉండాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నగరాభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజల భద్రత అంశాలపై విస్తృతంగా చర్చించారు. కోర్ అర్బన్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నగరాల్లో చెత్త సేకరణ, వర్గీకరణ, శాస్త్రీయ నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. దోమల నివారణ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, కాలానుగుణంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలం ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాలనీల్లో శుభ్రత, డ్రైనేజ్ వ్యవస్థల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని చెప్పారు. స్ట్రీట్ లైటింగ్ నిర్వహణలో సాంకేతికతను అనుసంధానం చేయాలని సీఎం ప్రత్యేకంగా సూచించారు. నగర వ్యాప్తంగా లైట్ల పరిస్థితిని పర్యవేక్షించే సమగ్ర వ్యవస్థ ఏర్పాటు చేసి, ఎక్కడ సమస్య తలెత్తినా కంట్రోల్ రూం ద్వారా వెంటనే స్పందించే విధానం తీసుకురావాలని ఆదేశించారు. చీకటి ప్రాంతాలు లేకుండా ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతపై కఠిన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

## సాక్ష్యాలు లేవని మాత్రమే కోర్టు చెప్పింది

**ఢిల్లీ మద్యం కేసు తీర్పుపై ఎంపీ అరవింద్**


**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఢిల్లీ మద్యం కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఊరట లభించడంపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా పలువురిపై నమోదైన సీబీఐ కేసును కోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందిస్తూ, కోర్టు సాక్ష్యాలు లేవని మాత్రమే పేర్కొనిందని, కానీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. కవిత ఆరోపిస్తున్నట్లుగా బీజేపీ, బీఆర్ఎస్ ఎప్పటికీ ఒక్కటి కాదని పేర్కొన్నారు. రాజకీయాల్లో అనేక వ్యాఖ్యలు వస్తుంటాయని, వాటన్నింటికీ స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. ఇక తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూడా ఈ అంశంపై స్పందించారు. ఇది బీజేపీ రాజకీయ డ్రామా అని విమర్శించారు.

# చీటీఫండ్స్!

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

భవిష్యత్తు అవసరాల కోసం రూపాయి రూపాయి కూడబెట్టుకునే సామాన్యుడి నమ్మకాన్ని ప్రైవేట్ చిట్ ఫండ్ కంపెనీలు నిలువునా వంచన చేస్తున్నాయి. పొదుపు పేరుతో వల విసరడం, తీరా అవసరానికి డబ్బు అడిగితే ముప్పుతిప్పలు పెట్టడం ఈ సంస్థలకు పరిపాటిగా మారింది. అడ్డగోలుగా వెలుస్తున్న ప్రైవేట్ చిట్ ఫండ్స్ ఇప్పుడు ఒక మాఫియాగా మారి, చట్టం కళ్లు గప్పి వేల కోట్ల రూపాయల ప్రజలకు దాచుకున్న సొమ్ము ఇవ్వకుండా రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నాయి.




### వలలో చిక్కుకున్నాకే అసలు రంగు!

ప్రైవేట్ చిట్ ఫండ్ కంపెనీల ఆగడాలు తొలుత మాయమాటలతోనే ప్రారంభమవుతాయి. ఏజెంట్ల ద్వారా ఇంటింటికీ చేరుతూ, అకర్షణీయమైన వడ్డీలు, సులభమైన నిబంధనలు అంటూ అమాయక ప్రజలను బుట్టలో పడేస్తారు. బ్యాంకుల కంటే ఎక్కువ లాభం వస్తుంది.., మీ బిడ్డ పెళ్లికి కచ్చితంగా చేతికి డబ్బు అందుతుంది.. అని నమ్మబలికి చిట్టీల్లో చేర్పిస్తారు. మధ్యతరగతి ప్రజలు తమ రెక్కల కష్టాన్ని ఈ సంస్థల చేతిలో పెడతారు. కానీ, చిట్టీ ప్రారంభమైన కొద్ది నెలలకే ఆ సంస్థల అసలు నైజం బయటపడుతుంది. కట్టేటప్పుడు ఉన్న మర్యాద, డబ్బు అడిగేటప్పుడు కనుమరుగవుతుంది.

### విత్‌డ్రా చేసుకోవాలంటే చుక్కలే..

ఏదైనా అత్యవసర పరిస్థితి వచ్చి మధ్యలో చిట్టీ డబ్బులు వెనక్కి తీసుకోవాలనుకుంటే బాధితుడికి నరకం కనిపిస్తుంది. భారీగా పర్సంటేజీలు కట్ చేయడం, లేనిపోని సర్వీస్ ఛార్జీల పేరుతో బాధితుడి సొమ్మును కాజేస్తారు. ఒకవేళ చిట్టీ పాట పాడుకున్నా, ఆ డబ్బు చేతికి రావడానికి నెలల సమయం పడుతుంది. అప్పటివరకు వేచి ఉండలేక బాధితులు ఆఫీసుల చుట్టూ తిరిగినా రేపు రా.. మాపు రా అంటూ కాలయాపన చేయడం ఈ సంస్థల నిత్యకృత్యమైంది.

### టర్మ్ పూర్తయినా తప్పని తిప్పలు

చాలామంది చిట్టీ గడువు పూర్తయిన తర్వాత తమ డబ్బు క్షేమంగా అందుతుందని భావిస్తారు. కానీ అక్కడే పెద్ద మోసం మొదలవుతుంది. టర్మ్ పూర్తయిన తర్వాత కూడా డబ్బులు ఇవ్వకుండా ష్యూరిటీలు తీసుకురమ్మంటూ వింత వింత నిబంధనలు పెడతారు. గెజిటెడ్ హోదా కలిగిన ప్రభుత్వ ఉద్యోగుల ష్యూరిటీలు కావాలని, ఒకవేళ అవి సమర్పించినా వాటిలో ఏదో ఒక లోపం వెతికి డబ్బులు విడుదల చేయకుండా అడ్డుకుంటారు. బాధితుడు కట్టిన అసలు సొమ్మును కూడా ఇవ్వకుండా ఇలా హింసించడం వెనుక ఉన్న ఉద్దేశ్యం.. ఆ డబ్బును మరికొంత కాలం తమ దగ్గరే ఉంచుకుని వడ్డీలు సంపాదించుకోవడం.

### చిట్టీ డబ్బులు రియల్ వ్యాపారంలోకి మళ్లింపు..

ప్రైవేట్ చిట్ ఫండ్ సంస్థలు చేస్తున్న మరో ఘోరమైన అపరాధం చిట్టీల సొమ్మును రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి మళ్లించడం. ముఖ్యంగా రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు పెద్ద మొత్తంలో చిట్టీలు వేసిన వారికి ఈ ముప్పు ఎక్కువగా ఉంటోంది. బాధితుడు తన చిట్టీ డబ్బులు అడిగినప్పుడు, ప్రస్తుతం నగదు లేదు.. మా వెంచర్‌లో ప్లాట్లు ఉన్నాయి.. కావాలంటే అవి తీసుకోండి.. అంటూ అంటగడుతున్నారు. నగదు కోసం వేచి చూసే బాధితులను భయపెట్టి, ఎక్కడికో ఊరు చివర వెంచర్లలో ప్లాట్లను ఎక్కువ ధరకు కట్టబెట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీనివల్ల బాధితుడికి అవసరానికి డబ్బు అందకపోగా, అమ్ముడుపోని ఆస్తులు నెత్తిన పడుతున్నాయి.

### బాధితుల ఆక్రందన

ఎన్ని ఫిర్యాదులు అందుతున్నా, ఎన్ని కేసులు నమోదవుతున్నా ప్రైవేట్ చిట్ ఫండ్స్ తీరు మారడం లేదు. చాలా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా గడువు ముగిసినా కొత్త చిట్టీలు ప్రారంభిస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయి. రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ అధికారుల పర్యవేక్షణ లోపం ఈ అక్రమార్కులకు వరంగా మారుతోంది. కొడుకు చదువుకో, బిడ్డ పెళ్లికో కూడబెట్టుకున్న డబ్బులు చిట్ ఫండ్ కంపెనీల పాలై, చివరకు ఆత్మహత్యల వరకు వెళ్తున్న ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకువచ్చి, ఈ చిట్ ఫండ్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**శృతి మించిపోతున్న ప్రైవేట్ చిట్స్ ఆగడాలు**

**పేద ప్రజల ఆశలు నిలువు దోపిడీ..**

- మాయమాటలతో వల.. తీరా డబ్బు అడిగితే చుక్కలు
- కష్టపడి దాచుకున్న సొమ్ము మాయగాళ్ల పాలు
- నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా అందని డబ్బు
- ష్యూరిటీల పేరుతో కొర్రీలు..
- చిట్టీ టర్మ్ ముగిసినా డబ్బివ్వకుండా దాగుడుమూతలు
- పేదల చిట్టీ డబ్బులతో రియల్ వ్యాపారం
- డబ్బివ్వమంటే పనికి రాని ప్లాట్లు అంటగడుతున్న వైనం

## మావోయిస్టు కీలక నేతల లొంగుబాటు..

# అసెంబ్లీలో ప్రకటన చేస్తాం

- మిగతావారు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తుపాకీ సిద్ధాంతం నడవదు : దేవ్‌జీ
- సచివాలయంలో మాజీ అగ్రనేతల భేటీ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



మావోయిస్టు కీలక నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. మావోయిస్టు మాజీ అగ్రనేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహారెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి చర్చలు జరిపారు. భేటీ అనంతరం సీఎం మాట్లాడుతూ.. జనజీవన స్రవంతిలోకి వచ్చిన తర్వాత చట్టపరిధిలో ఏ పని చేసినా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. అయితే చట్టాలను ఉల్లంఘిస్తే ప్రభుత్వం తన విధిని నిర్వర్తిస్తుందని స్పష్టం చేశారు. శాంతి, అభివృద్ధి మార్గమే రాష్ట్రానికి అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో సమావేశం అనంతరం మాజీ మావోయిస్టు దేవ్‌జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రివార్డు పాలసీని కోటి రూపాయలకు పెంచాలని కోరినట్లు తెలిపారు. తమకు ఐదెకరాల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినప్పటికీ, అది సాధ్యం కాదని సీఎం చెప్పారని వెల్లడించారు. అయితే ఇల్లు, ఉద్యోగం, జీవనభృతిపై హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతితో జైళ్లలో ఉన్న మావోయిస్టులను కలిసి, లొంగుబాట్లపై ప్రజలకు బహిరంగ లేఖ రాయాలని నిర్ణయించుకున్నట్లు దేవ్‌జీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ సిద్ధాంతం నడవదని ప్రజలకు వివరించేందుకు సిద్ధమని అన్నారు. రాష్ట్రంలో శాంతి స్థాపనకు ఇది కీలక పరిణామంగా భావిస్తున్నారు.

## న్యాయవ్యవస్థపై నమ్మకం నిలిచింది

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

మొదటి పేజీ తరువాయి

చేశానని, తాజా పరిణామాలతో అది నిర్ధారణ అయ్యిందని ఆమె తెలిపారు. ఈ వ్యవహారంతో తాను, తన కుటుంబం కొన్ని నెలలపాటు తీవ్ర క్షోభను అనుభవించామని చెప్పారు. విపక్షాలను వేధించేందుకు దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పు రాకముందే తనపై కొందరు అనుచిత వ్యాఖ్యలు చేశారని కవిత అన్నారు. కష్ట సమయంలో అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. వారి విశ్వాసం తనకు ధైర్యం ఇచ్చిందని పేర్కొన్నారు. ఇకముందు మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తానని, ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా పనిచేస్తానని కవిత తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం మరింత బలపడిందని ఆమె వ్యాఖ్యానించారు.

# అవినీతి.. అరాచకం..

**ఇవే కాంగ్రెస్ పాలన జోడెద్దు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

కాంగ్రెస్ పాలనలో అవినీతి, అరాచకం జోడెద్దులుగా మారాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన కౌన్సిలర్లకు ఘన సన్మానం నిర్వహించారు. ఆలంపూర్ నియోజకవర్గంలో విజయం సాధించిన ప్రజాప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు విశేష మద్దతు ఇచ్చారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో ప్రజల విశ్వాసం గులాబీ జెండాపైనే ఉందన్నారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన కొనసాగుతోందని కేటీఆర్ ఆరోపించారు. నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి సంఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన చర్యలని విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, పల్లె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని కేటీఆర్ అన్నారు. రైతు బంధు, ఎరువుల సరఫరా అంశాల్లో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారని విమర్శించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేయవచ్చని హెచ్చరిస్తూ, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ డిప్యూటీ సీఎంతో చంద్రబాబు భేటీ

**క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ**

**వివాహ కార్యక్రమానికి ఆహ్వానం**

**రెండు రాష్ట్రాల నాయకుల సౌహార్దం ప్రతిఫలనం**

**వేద న్యూస్, అమరావతి**

తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మరియు మంత్రి శ్రీధర్ బాబు ఇవాళ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మార్చి 5న హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు చిరంజీవి సూర్య విక్రమాదిత్య వివాహ కార్యక్రమానికి హాజరుకావాలని భట్టి విక్రమార్క ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని చంద్రబాబు నాయుడు సాదరంగా స్వీకరించినట్లు సమాచారం. ఈ భేటీ రెండు తెలుగు రాష్ట్రాల నాయకుల మధ్య స్నేహపూర్వక సంబంధాలను ప్రతిబింబించిందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వ్యక్తిగత వేడుకలకు పరస్పరం ఆహ్వానించుకోవడం ద్వారా సౌహార్ద వాతావరణం కొనసాగుతుందని విశ్లేషిస్తున్నారు. రాష్ట్రాల మధ్య పరిపాలన, అభివృద్ధి అంశాలపై కూడా సానుకూల వాతావరణం నెలకొనాలని ఈ సమావేశం సూచనగా భావిస్తున్నారు. ఇద్దరు నాయకులు కొంతసేపు అనౌపచారికంగా చర్చలు జరిపినట్లు సమాచారం.



వేద న్యూస్

శనివారం ఫిబ్రవరి 28, 2026

# ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరి

- టీఎస్జేయూ, చక్రవర్తి హాస్పిటల్, శ్రీకాంత్ మిత్ర బృందం ఆధ్వర్యంలో హెల్మెట్ల పంపిణీ
- అభినందించిన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ,ప్రముఖులు



**వేద న్యూస్, భూపాలపల్లి :**

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్య నారాయణరావు తెలిపారు. శుక్రవారం గణపురం పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ భూపాలపల్లి కమిటి, చక్రవర్తి హాస్పిటల్ వరంగల్, శ్రీకాంత్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హెల్మెట్ దరించకుండా వాహన దారులు నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్ని నియమ, నిబంధనలు విధించినా ప్రజలు వాటిని కచ్చితంగా పాటించాల్సిన బాధ్యత ఉందని అపుడే ప్రమాదాలు నివారించగలమని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ తో పాటు హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే వాహనాన్ని సీజ్ చేయాలని పోలీసులకు సూచించారు. ప్రాణం పోయిన తర్వాత బాధపడినా ఉపయోగం లేదని, ముందస్తు జాగ్రత్తలే ప్రాణాలను కాపాడుతాయని తెలిపారు. వాహనం నడిపేవారితో పాటు వెనుక కూర్చునేవారు కూడా విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎక్కడైనా వాహనాలు పట్టుకున్నప్పుడు తన పేరు చెప్పినా విడిచిపెట్టవద్దని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. సింగరేణి, ఎఎంఆర్, జెన్కో, మెగా తదితర సంస్థల ద్వారా మరిన్ని హెల్మెట్లు పంపిణీ చేయాలని కోరారు. చక్రవర్తి హాస్పిటల్ అధినేత డా తరుణ్ రెడ్డి 200 హెల్మెట్స్ వితరణ చేయాలని కోరగా ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారు. వ్యాపారవేత్తలు హెల్మెట్స్ వితరణ చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జనవరి మాసం మొత్తం రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడం అత్యంత ముఖ్యమని, ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్ అనే సిద్ధాంతాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఒక వ్యక్తి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం మొత్తం తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. వేగ నియంత్రణ పాటించాలని, చలానా వేస్తారనే భయంతో కాకుండా ప్రాణ భద్రత కోసం హెల్మెట్ ధరించాలన్నారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించని వారికి పెట్రోల్ బంకుల్లో



ఇంధనం ఇవ్వకూడదని సూచించారు. గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 6500 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించినట్లు తెలిపారు. రహదారి భద్రతను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నెలరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జర్నలిస్టులు, ప్రైవేట్ వైద్యులు, శ్రీకాంత్ మిత్ర బృందం ప్రజల ప్రాణ రక్షణ కోసం హెల్మెట్లు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. హెల్మెట్ వల్ల మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం వాహన దారులకు హెల్మెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో సందాని, డిపిఆర్ఓ శ్రీనివాస్, డీఎస్పీ సంపత్ కుమార్, స్థానిక సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ , చక్రవర్తి హాస్పిటల్ వైద్యులు తరుణ్ రెడ్డి, తెలంగాణ స్టేట్ జర్నలిస్టుల సంఘం స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ



పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రవీందర్, నాయకులు, శ్రీకాంత్ మిత్ర బృందం సుమన్, ఇమ్రాన్, నరేష్, మహేష్, వినయ్, కిరణ్, అభిలాష్, ప్రకాష్, భాను తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ నుండి హెల్మెట్ ధరించి వాహనం నడిపి అవగహన కల్పించారు.




## అభివృద్ధికి నిధులకు కేంద్ర మంత్రికి వినతి



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి మండల పరిధిలోని సూరారం, దండేపల్లి గ్రామాల భారతీయ జనతా పార్టీ నాయకులతో కలిసి కరీంనగర్ లోని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా జిల్లా కౌన్సిల్ మెంబర్ కుడుతాడి చిరంజీవి, మండల పార్టీ నాయకులు పల్లెపాటి మధుకర్, పెరుగు మధు, సూరారం గ్రామమాజీ సర్పంచ్ కబడ్డీ సంపత్ రావు, చిర శ్రీను, మాచర్ల తిరుపతి, శంకర్, బిట్ల లింగయ్య, సింగనవేన రాజు, కృష్ణం రాజు, నాగరాజు, సల్పాల కిరణ్, లక్ష్మారెడ్డి, వెంకట్ రావు తదితరులు కలిశారు ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని సంజయ్ ని కోరారు. కేంద్ర మంత్రి తమ వినతి పై సానుకూలంగా స్పందించినట్టు బీ జే పీ నేతలు తెలిపారు.

## రేపు "వేద" ఆస్పత్రిలో ఉచిత ఓపీ

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని వీణవంక రోడ్డు ఎస్బీఐ బ్యాంకు పక్కన 'వేద' కంటి, చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రిలో ఉచితంగా వచ్చే నెల1న (ఆదివారం) ఓపీ చూడనున్నట్లు సదరు ఆస్పత్రి డాక్టర్లు, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ టి.వెంకట్ సాయి నేత్ర ఎంబీబీఎస్ ఎంఎస్(ఆప్తమాలజీ), చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.నిఖిత దంపతులు వెల్లడించారు. కండ్లు ఎర్ర గా కావడం, కంటిలో నుంచి నీరు కారడం, గ్లకోమా, క్యాటరాక్ట్ వంటి ఆరోగ్య సమస్యలున్న వారిని చూసి.. తగు వైద్య సేవలు అందిస్తామని సాయి నేత్ర తెలిపారు. చెవి నొప్పి, చెవి అనారోగ్య సమస్యలు, ఎలర్జీ, వంటి అనారోగ్య సమస్యలు చూస్తామని, ఎండోస్కోపీ పై 50 శాతం రాయితీ ఇస్తామని చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.నిఖిత పేర్కొన్నారు. ఈ క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.



## మార్చి 3న రాజన్న భక్తులకు బిగ్ అలర్ట్

- చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయాలు మూసివేత

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

చంద్రగ్రహణం సందర్భంగా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రధాన ఆలయం మరియు అనుబంధ భీమేశ్వర స్వామి (భీమన్న) ఆలయాలను మార్చి 3వ తేదీన మూసివేస్తున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. కేతుగ్రస్త చంద్రగ్రహణం కారణంగా ఉదయం 6:15 గంటల నుంచి రాత్రి 7:15 గంటల వరకు ప్రధాన ఆలయాలతో పాటు అన్ని అనుబంధ ఆలయాల ద్వారాలు పూర్తిగా మూసివేయబడతాయి. గ్రహణం ముగిసిన అనంతరం ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, సంప్రోక్షణ వంటి క్రతువులు నిర్వహించి, అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అయితే గ్రహణానికి ముందు తెల్లవారుజామున సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు యథావిధిగా జరుగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఉదయం




6 గంటల తర్వాత దర్శనాలు నిలిపివేస్తారు. భక్తులు ఈ మార్పులను గమనించి ఆలయ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్



వేద న్యూస్, నడికుడ:

హనుమకొండ జిల్లా నడికుడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ శుక్రవారం రోజున భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇండ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఇండ్లు నిర్మించుకోవాలన్నారు. త్వరితగతిన ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దొంతుల కరుణాదేవి ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణం కాపాడిన కాంగ్రెస్ యువ నాయకుడు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన జెల్లా సంతమల్లు కాలి గాయంతో అత్యవసర శస్త్రచికిత్స చేయాల్సిన పరిస్థితి ఏర్పడగా, ఒాదీ+జవ రక్తం అవసరమని మెటుపల్లి సాయి సంజీవని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు వంశీ పిట్టల వెంటనే స్పందించి ఆసుపత్రికి చేరుకుని ఒాదీ+జవ రక్తాన్ని దానం చేశారు. సమయానికి రక్తం అందడంతో రోగికి శస్త్రచికిత్స నిర్వహించగలిగారు. రక్తదానం చేసి తమ కుటుంబ సభ్యుని ప్రాణం కాపాడిన వంశీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే వంశీని పలువురు అభినందించారు



## కుంగిన వంతెన.. ముంచుకొస్తున్న ప్రమాదం

- వెంటనే కొత్త బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి శివారు ప్రాంతంలోని భూపాలపట్నం-వేదురుగట్ట గ్రామాల మధ్య ఎస్ఆర్ఎస్పి డి-86 కాలువపై ఉన్న బ్రిడ్జి కుంగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలిపోతుందోననే భయంతో స్థానికులు గత రెండు రోజులుగా ఈ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరి కుంగిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో రెండు గ్రామాల మధ్య ప్రయాణం పూర్తిగా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉన్నందున సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



వేద న్యూస్

శనివారం ఫిబ్రవరి 28, 2026

# రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి

- సురక్షిత ప్రయాణం సాగించాలి
- కారేపల్లి ఎస్సై గోపి



**వేద న్యూస్, కారేపల్లి:**

రోడ్డు నిబంధనలు పాటిస్తూ సురక్షితమైన ప్రయాణం సాగించాలని కారేపల్లి ఎస్సై గోపి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పోలీస్ శాఖ నిర్వహిస్తున్న రెండో విడత 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి పర్యవేక్షణలో కారేపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, వాహనదారులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఎస్సై గోపి మాట్లాడుతూ.. అతివేగం, మద్యం మత్తులో వాహనదానం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రహదారులు రక్తపాతం అవుతూ విలువైన ప్రాణాలు కోల్పోతున్నాయని, బాధిత కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోతున్నాయని అన్నారు. రోడ్డు భద్రత పోలీసుల ఒక్కరి బాధ్యత కాదని, సమాజం మొత్తం కలిసికట్టుగా ముందుకు వస్తేనే ప్రమాదాలను తగ్గించగలమన్నారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ఒక ప్రజా ఉద్యమంగా మారాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ఇతరులను కూడా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

# పౌర హక్కులకు భంగం కలిగించరాదు

- తహసీల్దార్ ముప్పు కృష్ణ
- దస్తగిరిపల్లిలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

**వేద న్యూస్, నల్లబెల్లి:**



పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లబెల్లి మండలం దస్తగిరిపల్లి గ్రామంలో శుక్రవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ ముప్పు కృష్ణ అధ్యక్షత వహించగా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముప్పు కృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ పౌర హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రాముఖ్యతను గ్రామస్తులకు వివరించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలకు తావులేకుండా సామరస్య వాతావరణంలో జీవించాలని పిలుపునిచ్చారు.

# నామమాత్రంగా 'ఉపాధి' తనిఖీ ఓపెన్ ఫోరం

- సిబ్బంది తప్ప జనం లేని ప్రజా వేదిక
- వివరాలు గోప్యం.. నివేదికలు సిద్ధం



**వేద న్యూస్, కారేపల్లి:**

ఖమ్మం జిల్లా సింగరేణి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నామమాత్రంగా జరిగింది. కార్యక్రమానికి డీఆర్డీఓ అదనపు పీడీ శ్రీదేవి హాజరయ్యారు. ఉపాధి హామీ చట్టం కింద 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31 వరకు మండలంలోని గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనులపై 17వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. మొత్తం 561 పనులను పరిశీలించగా, వాటిలో ఎన్ఆర్ఈజీఎస్ కింద 469, పీఆర్ కింద 91, మన ఊరు–మన బడి (హౌసింగ్) కింద 1 పని ఉన్నట్లు వెల్లడించారు. ఈ పనుల కోసం కూలీలు, మెటీరియల్ ఖర్చులు కలిపి సుమారు రూ.9,00,32,392 వ్యయం చేసినట్లు తెలిపారు. వారం రోజుల పాటు గ్రామాల్లో పర్యటించిన తనిఖీ బృందం పనుల అమలు, కూలీల హాజరు తదితర అంశాలను పరిశీలించింది. కొన్ని తప్పిదాలు గుర్తించిన నేపథ్యంలో సంబంధిత అధికారుల నుండి రికవరీ చేయనున్నట్లు సమాచారం. అయితే ప్రజా వేదిక కార్యక్రమానికి అధికారులు, ఉపాధి సిబ్బంది తప్ప ప్రజలు హాజరుకాకపోవడం విమర్శలకు దారితీసింది. తనిఖీ వివరాలను గోప్యంగా ఉంచి నివేదికలు సిద్ధం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా వేదికను బహిరంగ ప్రదేశంలో నిర్వహించి ప్రజలకు పూర్తి సమాచారం అందించాలని సీపీఎం జిల్లా నాయకుడు కొండబోయిన నాగేశ్వరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి. శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, అంబుడ్స్‌మన్ రమేశ్ బాబు, విజిలెన్స్ అధికారులు, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది మరియు స్థానిక ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

- మానవత్వం చాటుకున్న క్లాస్‌మేట్స్



**వేద న్యూస్, కారేపల్లి:**

కష్టాల్లో ఉన్న స్నేహితుడి కుటుంబానికి అండగా నిలబడి నిజమైన స్నేహం ఏమిటో కొందరు పూర్వ విద్యార్థులు నిరూపించారు. సింగరేణి మండల పరిధిలోని దుబ్బతండా గ్రామానికి చెందిన భూక్యా శ్రీనివాసరావు ఈ నెల 18న గుండెపోటుతో ఆకస్మికంగా మరణించాడు. ఈ విషాద సమయంలో ఆయనతో కలిసి ఇంటర్మీడియట్ చదువుకున్న మిత్రులు భూక్యా రాంబాబు, శివాజీ, తేజవత్ బావుసింగ్, విజయ్ కుమార్, వీరన్న, బావుసింగ్, రవికుమార్ కలిసి కుటుంబ పరిస్థితిని తెలుసుకుని చలించిపోయారు. గురువారం జరిగిన దశదినకర్మ సందర్భంగా వారు సేకరించిన రూ.5వేలు నగదును మృతుని కుమారుడికి అందజేసి తమ వంతు సహాయం చేశారు. స్నేహితుని మంచితనాన్ని స్మరించుకుంటూ, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మిత్రులు తెలిపారు. ఆపదలో చేయూతనిచ్చిన వీరి చొరవను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నీల నాగరాజు ఎన్నిక

**వేద న్యూస్, జమ్మికుంట:**




తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా వీణవంక మండల కేంద్రానికి చెందిన నీల నాగరాజును నియమించారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నీల నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర పరిధిలోని అన్ని జిల్లాలు, మండలాల్లో వారం రోజుల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు అయ్యే వరకు నిరంతర పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్‌కు, అలాగే తెలంగాణ ఉద్యమకారులందరికీ నీల నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# నిరుపేదలపై కాంగ్రెస్ సర్కార్ ప్రతాపం

- సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ధ్వజం

**వేద న్యూస్, కారేపల్లి:**



ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్ల కాలనీలో నిరుపేదల గుడిసెల కూల్చివేతపై సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ (అశోక్ అన్న వర్గం) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం బాధిత ప్రాంతాన్ని సందర్శించిన పార్టీ కారేపల్లికామేపల్లి ఇంచార్జ్ భూక్య శివ నాయక్, ప్రభావిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లుగా భూదాన్ భూముల్లో నివసిస్తున్న సుమారు 600 నిరుపేద కుటుంబాల గుడిసెలను భారీ పోలీసు బలగాలతో చుట్టుముట్టి జేసీబీలతో కూల్చివేయడం అమానుష చర్య అని విమర్శించారు. పట్టాలు ఇవ్వాలని శాంతియుతంగా కోరుతున్న పేదలపై ఈ విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన కూల్చివేతల తరహాలోనే ఖమ్మంలో కూడా పేదల నివాసాలపై చర్యలు తీసుకుంటున్నారని, ఇది పేదల ప్రభుత్వం కాదని ఆయన ఆరోపించారు. జిల్లాలో మంత్రులు ఉన్నప్పటికీ 80 గజాల్లో గుడిసె వేసుకున్న నిరుపేదలపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తక్షణ న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుంకర బుచ్చయ్య, దంతాల నారాయణ, జ్యోతి, సిహెచ్ రాములు, నందిని, రాణి తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య జ్యోతి హైస్కూల్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలు

- ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి




**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండల కేంద్రంలోని కారుణ్య జ్యోతి హై స్కూల్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఉషారాణి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీపప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 2000లో ప్రారంభమైన ఈ పాఠశాల తక్కువ ఫీజులతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం అభినందనీయమన్నారు. చదువుతోనే ఉన్నత భవిష్యత్తు సాధ్యమని విద్యార్థులకు సూచించారు. 25 ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తిరిగి అదే పాఠశాలలో కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగడం గురువులకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుమ్మడి వేణు, గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి చూపు పరీక్షలు

- ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో
- డ్రైవర్ల కంటి చూపు బాగుంటే రోడ్డు ప్రమాదాలను నివారించగలం : సీపీ సన్ ప్రీత్ సింగ్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**



డ్రైవర్ల కంటి చూపు బాగుంటే రోడ్డు ప్రమాదాలను తగ్గించగలమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరైవ్–ఆలైవ్ రెండవ విడతలో వరంగల్ ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యంలో ములుగు రోడ్డులోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక రిజినయన్ ఐ హస్పటల్, శరత్ ఐ హస్పటల్, కీర్తి హస్పటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొని కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి సుమారు నాలుగు వందలకుపై ఆటో డ్రైవర్లు కంటి పరీక్షలు నిర్వహించుకోగా, మూడు వందలకుపై డ్రైవర్లకు కంటి అద్దాలను అందజేయడం జరింది. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలనే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్య మంత్రి ఆరైవ్–ఆలైవ్ ప్రారంభించడం జరిగిందని. రోడ్డు నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకమని,ముఖ్యంగా వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం సహజమని, ముఖ్యంగా ప్రజలను తరలించే ప్యాసింజర్ వాహనాలకు చెందిన డ్రైవర్లు తమ కంటి చూపుపై మరింత శ్రద్ధ వహించాలని, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులను వారి గమ్య స్థాలను క్షేమంగా చేరవేయాల్సిన బాధ్యత డ్రైవర్లపై వుందని, ముఖ్యంగా కంటి చూపుతో బాధపడే వారు వాహనం నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే అస్కారం అధికమని, రోడ్డు ప్రమాదాల నివారణకై డ్రైవర్లు సైతం నిరంతం కంటి పరీక్షలు నిర్వహించుకోవడం క్షేమకరమని. అదే విధంగా కంటి చూపు బాగుంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలను గుర్తించడం ద్వారా సురక్షితంగా డ్రైవింగ్ చేయగలమని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. అనంతరం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ఆటో డ్రైవర్లకు కంటి అద్దాలను అందజేసారు. ఈ కార్యక్రమములో సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ట్రాఫిక్ అదనపు డిసిపి ప్రభాకర్ రావు, ఏసిపిలు సత్యనారయణ, నర్సింహరావు, ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్లు సుజాత, సీతా రెడ్డి,వెంకన్న, మట్టెవాడ ఇన్స్ స్పెక్టర్ కరుణాకార్, డాక్టర్లు శ్రీదేవి,డా.దిలిప్,రంజన్ కుమార్ వారి సిబ్బంది పాల్గోన్నారు.

వేద న్యూస్

శనివారం ఫిబ్రవరి 28, 2026

# ముగిసిన సర్పంచ్‌ల శిక్షణా తరగతులు

**– పాలనపై పట్టు సాధించిన ప్రజాప్రతినిధులు**

**వేద న్యూస్, కారేపల్లి:**

గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా పంచాయతీ పాలనలో పారదర్శకత పెంపు దిశగా ఖమ్మం జిల్లా డీపీఆర్‌సీ (జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం)లో సింగరేణి మండల సర్పంచ్‌లకు నిర్వహించిన ఐదు రోజుల జిల్లా స్థాయి శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిశాయి. జిల్లా స్థాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, పారిశుధ్య నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు, డిజిటల్ పాలన వంటి కీలక అంశాలపై సర్పంచ్‌లకు సమగ్ర అవగాహన కల్పించారు. శిక్షణా కాలంలో సర్పంచ్‌లు చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసిన సర్పంచ్‌లకు జిల్లా అధికారుల చేతుల మీదుగా ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) మల్లెల రవీంద్రప్రసాద్ పాల్గొని సర్పంచ్‌లను అభినందించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామ స్థాయిలో అమలు చేసి సింగరేణి మండలాన్ని జిల్లాలో ఆదర్శంగా తీర్చి




దిద్దాలి. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం అని ఎంపీవో పేర్కొన్నారు. శిక్షణతో తమకు పాలనపై మరింత స్పష్టత వచ్చిందని సర్పంచ్‌లు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగరేణి మండలంలోని సర్పంచ్‌లు, డీపీఆర్‌సీ శిక్షకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

**– ఏరియా జీఎం రాధాకృష్ణ**



**వేద న్యూస్, మందమర్రి:**

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలతో పాటు సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యతనిస్తామని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో జరిగిన 15వ నిర్మాణాత్మక సమీక్షా సమావేశంలో (స్ట్రక్చర్ మీటింగ్) గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యూనియన్ ప్రతినిధులతో కలిసి గడిచిన సమావేశ నిర్ణయాల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, జీఎం వెంటనే స్పందించి సంబంధిత అధికారులను పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధిలో కార్మిక సంఘాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఇప్పటివరకు అందించిన సహకారం మాదిరిగానే ముందుకూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్‌వో టు జీఎం జీఎల్ ప్రసాద్, డీజీఎం పర్సనల్ అశోక్, వివిధ విభాగాల అధికారులు, ఏఐటీయూసీ ప్రతినిధులు మరియు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన డా. దివ్యమూర్తి

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన డా. గుగ్గిళ్ల దివ్యమూర్తి ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలోని గండ్లూరు కిషన్ రావు కళ్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. జగ్గయ్య పేటకు చెందిన కుసుమ నాగేశ్వరరావు -లక్ష్మి దంపతుల కుమారుడు చంద్రశేఖర్, ముదిగొండ మండలం వల్లభికి చెందిన మిట్టకోల ఉష ద్వితీయ కుమార్తె లక్ష్మి స్వరూపల వివాహం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డా. గుగ్గిళ్ల దివ్యమూర్తి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొదుమూరి దిలీప్, కమర్తపు సాయి, పెదపాక గోపి తదితరులు పాల్గొన్నారు.

# రాజరాజేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేటలోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి (శివుడు) విగ్రహం మరియు గోశాల స్తంభం ప్రతిష్ట మహోత్సవం భక్తుల సందడిలో వైభవంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు కొండ శివ యాదవ్, అయినవోలు మల్లికార్జున శాస్త్రి ఆధ్వర్యంలో ఆగమ శాస్త్ర ప్రకారం జలాధివాసం, ధాన్యాధివాసం, హోమాలు, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, మహాదాశీర్వచనం వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడాయి. ఈ కార్యక్రమాల్లో పల్లపు నర్సింగారావు, శ్రీనివాసరావు, సంపత్ రెడ్డిహరీష్ దంపతులు పాల్గొన్నారు. అలాగే టీఆర్పీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు బత్తిని వెంకటేశ్వర్ గౌడ్, మోహన్ దుర్గాప్రసాద్, బన్నీ, ఉమేష్, అనిల్, క్రాంతి సూరి, మల్లేష్ యాదవ్, మురారి, రమేష్, శంకర్ తదితరులు హాజరయ్యారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మంచి దొంగ!

- కరిగిన దొంగ మనసు
- పేద కుటుంబానికి తిరిగి అందిన సొత్తు
- కారేపల్లి మండలంలో అరుదైన ఘటన



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండలంలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. దొంగతనానికి గురైన పేద కుటుంబానికి అపహరించిన సొత్తును గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే తిరిగి ఇంటి ముందు వదిలివెళ్లడం స్థానికంగా చర్చనీయాంశమైంది. చీమ్లు తండాకు చెందిన గుగులోత్ వీరు అనే శ్రామికుడు ఏళ్ల తరబడి కూడబెట్టుకున్న తులం బంగారం, 30 తులాల వెండి, రూ.10 వేల నగదు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. తమ సర్వస్వం పోయిందని బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. అయితే గురువారం అర్ధరాత్రి సమయంలో దొంగిలించిన వస్తువులను ఒక కవర్‌లో పెట్టి ఇంటి గుమ్మం ముందు వదిలివెళ్లినట్లు తెలిసింది. ఉదయం లేచి చూసిన బాధితులు తమ సొత్తు తిరిగి లభించడంతో ఆశ్చర్యం, ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఘటన వెనుక కారణాలపై స్థానికంగా పలు చర్చలు జరుగుతున్నాయి. పేద కుటుంబం పరిస్థితిని చూసి దొంగలు పశ్చాత్తాపంతో తిరిగి ఇచ్చారా? లేక పోలీసుల గాలింపుకు భయపడి వెనక్కి వచ్చారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొత్తు తిరిగి వచ్చినప్పటికీ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# పల్లె ప్రకృతి వనం, నర్సరీని సందర్శించిన డీపీవో

**వేద న్యూస్, శాయంపేట:**



హనుమకొండ జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి రమాకాంత్, పరకాల డివిజినల్ పంచాయతీ అధికారి రవిబాబు శాయంపేట మండలంలో పర్యటించారు. శాయంపేట, ప్రగతి సింగారం రైతు వేదికల్లో కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పంచాయతీ నిధుల వినియోగం, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు, డిజిటల్ పాలన వంటి అంశాలపై అందిస్తున్న అవగాహన శిక్షణను పరిశీలించారు. అనంతరం మైలారం గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనం పెంపు ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల్లో మొక్కలు నాటి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నామని, మొక్కల సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బుర్ర రంజిత్ కుమార్, టీఓటీ శిక్షకులు రాయకంటి రాజు, సునీల్, వలస తిరుపతి, వెల్పుల సంతోష్, పంచాయతీ కార్యదర్శులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైవర్ల చూపు మెరుగైతే ప్రమాదాలు తగ్గుతాయి

- జిల్లా అదనపు ఎస్పీ మహేందర్
- అరైవ్ అలైవ్ రెండో దశలో ఉచిత కంటి పరీక్షలు




**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో చేపట్టిన అరైవ్ అలైవ్ రెండో దశ కార్యక్రమం మెదక్ జిల్లాలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా మెదక్ పట్టణంలోని బస్సు డిపో ప్రాంగణంలో బస్సు డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ప్రారంభించారు. మెదక్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో, స్థానిక వైద్యుల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో డ్రైవర్లకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించారు. దూరదృష్టి లోపం, చూపు మందగించడం, కంటి ఒత్తిడి వంటి సమస్యలను గుర్తించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ చట్టాలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు. అధిక వేగం, అలసటతో వాహనం నడపడం, లేన్ క్రమశిక్షణ పాటించకపోవడం వంటి కారణాలు ప్రమాదాలకు దారితీస్తాయని వివరించారు. అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ.. డ్రైవర్లలో చూపు సమస్యలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయని తెలిపారు. ప్రతి డ్రైవర్ నిరంతరం కంటి పరీక్షలు చేయించుకుని, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో మెదక్ డిపో మేనేజర్ సురేఖ, మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్టీసీ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

**వేద న్యూస్, శాయంపేట:**

మద్యం సేవించి వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు కోర్టు జైలు శిక్ష విధించినట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. శాయంపేట మండలంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో చౌలాపల్లి గ్రామానికి చెందిన అద్దిచర్ల మహేందర్‌కు రూ.1,500 జరిమానాతో పాటు రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. రేలకుంట గ్రామానికి చెందిన మాసంపల్లి కిషన్‌రావుకు రూ.2,000 జరిమానా, మూడు రోజుల జైలు శిక్ష, చౌటుపర్తి గ్రామానికి చెందిన ఎన్.రెడ్డి రాజిరెడ్డికి రూ.2,000 జరిమానా, మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మరో ముగ్గురు వ్యక్తులు పరికి రవి (గుడెప్పహాడ్), వావిల్లా కొమురయ్య (ముద్దునూరు), మార్క రమేష్ (ములుగు ఘనపూర్)లకు కలిపి రూ.9,700 జరిమానా విధించారు. పట్టుబడిన వారిని సెకండ్ క్లాస్ ఇన్‌చార్జ్ మేజిస్ట్రేట్ మరియు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీవల్లి శైలజ ఎదుట హాజరుపరచగా శిక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్సై తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాతో పాటు జైలుశిక్ష తప్పదని ఎస్సై జక్కుల పరమేష్ హెచ్చరించారు.

# సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో భూమి పూజ

**వేద న్యూస్, మందమర్రి:**



మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల పునర్నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థి పరిషత్, ప్రబంధకారిణి మరియు ఆచార్య బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మందమర్రి తహసీల్దార్ పి. సతీష్ కుమార్ శర్మ పాల్గొన్నారు. సరస్వతీ విద్యాపీఠం ప్రతినిధులు పతకమూరి శ్రీనివాసరావు, రావుల సూర్యనారాయణ, రాజారెడ్డి హాజరయ్యారు. వేదమంత్రాల నడుమ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పాఠశాలకు పూర్వ వైభవాన్ని తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. పూర్వ విద్యార్థులు, సమాజ శ్రేయస్సు కోరుకునే వారు అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దహెగాం గోవిందరావు, డాక్టర్ విష్ణువర్ధన్ రావు, పొడిపాక విద్యాసాగర్, బీజేపీ నాయకులు అందుగుల శ్రీనివాస్, డాక్టర్ ఉదారి చంద్రమోహన్ గౌడ్, వ్యాపార సంఘం అధ్యక్షుడు తమ్మిశెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# నూతన కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



**వేద న్యూస్, మెదక్:**

మెదక్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రతిమ సింగ్ ఐఏఎస్‌ను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిశారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలో కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో 80% ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి

- కాజీపేటను రైల్వే డివిజన్‌గా ప్రకటించాలి
- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేటలో ప్రతిపాదిత కోచ్ ఫ్యాక్టరీలో 80 శాతం ఉద్యోగాలు స్థానికులకు కేటాయించాలని, కాజీపేటను ప్రత్యేక రైల్వే డివిజన్‌గా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ హన్మకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కోచ్ ఫ్యాక్టరీ ఓరుగల్లు ప్రజల చిరకాల స్వప్నమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును సాధించేందుకు బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడిందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తెలంగాణపై వివక్ష చూపుతున్నాయని విమర్శించారు. 1969 తెలంగాణ ఉద్యమం నుంచే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ డిమాండ్ ఉందని, 1982లో మంజూరైన ప్రాజెక్టు తరువాత ఇతర రాష్ట్రాలకు మళ్లించబడిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా కేంద్రం పూర్తి స్థాయి కోచ్ ఫ్యాక్టరీకి ఆమోదం ఇవ్వకుండా, వాగన్ పిరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్‌గా పరిమితం చేసిందని ఆరోపించారు.



తెలంగాణ ప్రభుత్వం భూమి సేకరణలో సహకరించినప్పటికీ, కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. అస్సాం, మహారాష్ట్రలకు కోచ్ ఫ్యాక్టరీలు మంజూరు చేసి, తెలంగాణకు నిరాకరించడం వివక్షకరమని వ్యాఖ్యానించారు. స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై శనివారం కాజీపేటలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీడీఎస్యూ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**




ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారత జాతీయోద్యమ విప్లవ వీరుడు చంద్రశేఖర్ ఆజాద్ 95వ వర్ధంతి సందర్భంగా కేయూ లైబ్రరీ ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్యూ కేయూ అధ్యక్షుడు బి. బాలకృష్ణ, తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కో-కన్వీనర్ పి. అనూష మాట్లాడుతూ 1931 ఫిబ్రవరి 27న బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ అమరుడయ్యారని గుర్తుచేశారు. ఆయన త్యాగం విద్యార్థి, యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నేటి విద్యార్థులు విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా, కుల-మత అసమానతలపై పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యారంగానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందించాలని, విద్యార్థి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు




- త్వరితగతిన పూర్తి చేయాలి
- విసిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణపై ఎస్పీ దిశానిర్దేశం

**వేద న్యూస్, మెదక్:**

మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఐపీఎస్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ, ఎన్‌బీడబ్ల్యూస్, మిస్సింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం అందించడంలో ఆలస్యం ఉండకూడదని ఎస్పీ స్పష్టం చేశారు. అత్యాచారం, పోక్సో కేసులు నిర్ణీత గడువుల్లో పూర్తి చేసి నిందితులను కోర్టు ముందు నిలపాలని ఆదేశించారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ అమలు చేయాలని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, సీసీ కెమెరాల వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ రోజూ రెండు గంటల వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని స్పందించాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను ప్రశంస పత్రాలతో అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైవర్లకు ఉచిత కంటి చికిత్స

**వేద న్యూస్, మడికొండ:**



తెలంగాణ డీజీపీ శివదర్ రెడ్డి సూచనల మేరకు, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల ప్రకారం అరైవ్ అలైవ్ కార్యక్రమం రెండో విడతలో భాగంగా మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం లారీ, టిప్పర్, బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం సుమారు 45 మంది డ్రైవర్లను కాజీపేటలోని నవదృష్టి కంటి ఆసుపత్రికి తరలించి డాక్టర్ సిస్టర్ లీలా పర్యవేక్షణలో కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కిషన్ మాట్లాడుతూ, రాత్రింబగళ్లు దూర ప్రయాణాలు చేసే డ్రైవర్లకు స్పష్టమైన చూపు అత్యంత అవసరమని తెలిపారు. డ్రైవర్ల భద్రత ద్వారా ప్రయాణికుల ప్రాణాలు రక్షించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ 2047 సాధన దిశగా కృషి చేయాలి

- కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో పేదరిక నిర్మూలన, ఆరోగ్య సేవల విస్తరణ, మహిళా సాధికారత, డిజిటల్ చేర్పు వంటి కీలక రంగాల్లో గణనీయ పురోగతి సాధించాలని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. విశ్వవిద్యాలయ సెనేట్ హాల్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు "ఇంటిగ్రేటింగ్ ఎస్‌డీజీస్ ఫర్ వికసిత్ భారత్ ఏ 2047: అచీవ్‌మెంట్స్ అండ్ పాత్‌వేస్" ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. డేటా ఆధారిత విధానాలు, రియల్-టైమ్ మానిటరింగ్, గ్రీన్ ఎకానమీ, పునరుత్పాదక శక్తి, వాతావరణ చర్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. యువత, మహిళలు, స్టార్టప్‌లు, ప్రైవేట్ రంగం భాగస్వామ్యం కీలకమని తెలిపారు. క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ వికసిత్ భారత్




సాధన కేవలం ఆర్థిక వృద్ధి మాత్రమే కాకుండా, సమానత్వం, పర్యావరణ సమతుల్యత, సామాజిక న్యాయం, సాంకేతిక ప్రగతితో కూడిన సమగ్ర అభివృద్ధిగా ఉండాలని అన్నారు. యూజీసీ సమన్వయ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి ఎస్‌డీజీ లక్ష్యాలను జాతీయ అభివృద్ధి అజెండాతో అనుసంధానించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జెడ్పీహెచ్‌ఎస్ లో స్వయం పరిపాలన దినోత్సవం

**వేద న్యూస్, టేక్మాల్:**



మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని ఎలుపేట్ జడ్పీహెచ్ పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఎంఈఓగా హిందూజ, ప్రధానోపాధ్యాయుడిగా నితీష్ కుమార్, పీటీగా వర్షిత్ బాధ్యతలు నిర్వర్తించగా, ఉపాధ్యాయులుగా మహేష్, శ్రవణ్ కుమార్, వివేక్, కిరణ్ కుమార్, మమత, అఖిల వ్యవహరించారు. విద్యార్థులు చక్కగా బోధన చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

- ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి
- ఖమ్మం దిశ సమావేశంలో కేంద్ర పథకాలపై సమీక్ష

**వేద న్యూస్, ఖమ్మం:**

ప్రజలకు లబ్ధి చేకూరేలా కేంద్ర ప్రాయోజిత పథకాలను జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు, మేయర్ తదితరులతో కలిసి పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు కేంద్ర పథకాల అమలు పురోగతిపై నివేదికలు సమర్పించారు. ఎంపీ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకానికి బదులుగా వచ్చిన "వికసిత్ భారత్ జీ రామ్ జీ" మార్గదర్శకాలు ప్రజాప్రతినిధులకు అందేలా చూడాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని, కేంద్ర వైద్య పథకాలలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల అభివృద్ధి, ఖమ్మం ఆసుపత్రి మౌలిక వసతులపై నివేదికలు సమర్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యత పర్యవేక్షణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఖమ్మం జనరల్ ఆసుపత్రి అవసరాలపై సంక్షిప్త నివేదిక సిద్ధం చేసినట్లు చెప్పారు. జిల్లాలో 10 వేల ఇందిరమ్మ ఇళ్లు స్లాబ్ దశకు చేరుకున్నాయని, రెండు నెలల్లో పూర్తిచేసేలా కృషి చేస్తున్నామని వెల్లడించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు 30 ప్రమాదకర జంక్షన్‌లలో చర్యలు చేపడుతున్నామని, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు.




# రంగాపురంలో దోమల మందు పిచికారీ


**వేద న్యూస్, నల్లబెల్లి:**



నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామంలో దోమల నివారణ కోసం ప్రత్యేకంగా పొగమందు పిచికారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధవి మాట్లాడుతూ, గ్రామస్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల నివారణకు ముందస్తు చర్యగా డెల్టా మైత్రిన్ మందును గ్రామంలోని అన్ని వీధుల్లో పిచికారీ చేసినట్లు తెలిపారు. గ్రామంలో దోమల సమస్యను తగ్గించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కస్తూరి రామ్మూర్తి, వార్డు సభ్యురాలు మందల సుజాత, జోగు ప్రభాకర్ తదితరులు, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ సైన్స్ దినోత్సవం సందేశం

- జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమం



**వేద న్యూస్, బోయినిపల్లి:**

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపక కన్వీనర్ సి. రామరాజు యువతకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. కష్టపడి పని చేయండి, లోతుగా ఆలోచించండి, కొత్త విషయాలను కనుగొనండి అనే పిలుపుని యువత ఆచరణలో పెట్టాలని సూచించారు. విజ్ఞాన శాస్త్రం ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమవు తుందని పేర్కొన్నారు. శాస్త్ర రంగంలో నిధుల కొరత, డిజిటల్ డివైడ్, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం వంటి సమస్యలు ప్రధాన ఆటంకాలుగా ఉన్నాయని అన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ప్రయోగశాల సదుపాయాలు, ప్రాక్టికల్ ప్రాజెక్టులు పెంచాలని సూచించారు. పర్యావరణం, ఆరోగ్యం వంటి స్థానిక సమస్యలపై పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాల నిర్మూలనకు శాస్త్రీయ అవగాహన అవసరమని తెలిపారు. తెలంగాణలో కూడా మూఢనమ్మకాల నిర్మూలనకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ కౌన్సిలర్లు

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నూతన బీజేపీ కౌన్సిలర్లు శుక్రవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. సమీకృత మార్కెట్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని వారు కోరారు. పట్టణ అభివృద్ధికి కేంద్రం నుంచి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజన్నల రాజు, జిట్టా మంగ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వేద న్యూస్

శనివారం ఫిబ్రవరి 28, 2026

# రాజకీయ కక్ష్యతోనే అట్రాసిటీ కేసు

**– టీఆర్పీ నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పుల వెంకటేష్**

**వేద న్యూస్, గంగాధర:**

పవిత్రమైన అట్రాసిటీ చట్టాన్ని రాజకీయ కక్ష్య సాధింపుల కోసం వినియోగించడం దురదృష్టకరమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పుల వెంకటేష్ ఆరోపించారు. గంగాధర మండలంలో జరుగుతున్న మట్టి అక్రమ రవాణా వ్యవహారంపై సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సమాచారం అందించిన నేపథ్యంలో ఈ నెల 15న తనపై అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయడం రాజకీయ ప్రేరేపిత చర్య అని ఆయన పేర్కొన్నారు. ఈ చర్య వెనుక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఉన్నారని ఆరోపించారు. కురిక్యాల నుంచి షానగర్ వరకు వరద కాల్వ ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళల్లో మట్టి తరలింపు జరుగుతోందని గత కొద్ది రోజులుగా



ప్రస్తావించానని తెలిపారు. అధికారులను అప్రమత్తం చేయాలనే ఉద్దేశంతో చేసిన ప్రయత్నాలకు బదులుగా తనపై కేసు పెట్టడం అన్యాయమన్నారు. ఈ కేసుపై తాను న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని, అక్రమ మట్టి రవాణా వివరాలను ప్రజల ముందుకు తీసుకువస్తానని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముంపు బాధితులకు పూర్తి న్యాయం చేస్తాం

**– ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులకు పూర్తి స్థాయి నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి ముంపు బాధితుల సమస్యలను వివరించారు. భూ సేకరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే రూ.23.50 కోట్లు మంజూరు చేయించామని, ఇంకా పలువురు బాధితులకు చెల్లింపులు జరగాల్సి ఉన్నందున అదనంగా రూ.20 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై మంత్రి సానుకూలంగా స్పందించి, అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ కాలంలో సమస్యలు నిర్లక్ష్యానికి గురయ్యాయని,



ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సమస్య పరిష్కార దిశగా కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నారాయణపూర్ నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు తన ప్రయత్నాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

# అఖిల్ 'లెనిన్'పై భాగ్యశ్రీ భారీ ఆశలు



**వేద న్యూస్ డెస్క్:**

సినిమా ప్రపంచంలో అడుగుపెట్టే ప్రతి నటికీ అందం, అభినయం ఉండటం సహజమే. కానీ విజయ శిఖరాన్ని చేరుకోవాలంటే వీటితో పాటు అదృష్టం కూడా తోడవ్వాలని చెబుతున్నారు సినీ విశ్లేషకులు. కొందరు తొలి చిత్రంతోనే అగ్రస్థానానికి చేరుకుంటే, మరికొందరు మంచి ప్రతిభ ఉన్నా సరైన అవకాశానికి నిరీక్షించాల్సి వస్తుంది. ప్రస్తుతం యువ నటి భాగ్యశ్రీ బోర్సే పరిస్థితి కూడా అలాంటిదేనని సినీ వర్గాలు భావిస్తున్నాయి. తన అందం, చిరునవ్వుతో కుర్రకారును ఆకట్టుకున్న ఆమె, తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు పొందింది. సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ఆదరణ దక్కించుకున్నా, కెరీర్ పరంగా మాత్రం ఇప్పటివరకు ఘనవిజయం అందుకోలేకపోయింది. గ్లామర్ పరంగా ప్రశంసలు అందుకున్న ఈ భామకు, బలమైన కథతో కూడిన విజయమే ఇప్పుడు అత్యవసరంగా మారింది. అందుకే ప్రస్తుతం ఆమె ఆశలన్నీ ఒకే చిత్రంపై కేంద్రీకృతమయ్యాయి. ఆ చిత్రం మరెవరో కాదు అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటిస్తున్న "లెనిన్". మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై పరిశ్రమలో మంచి అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రూపొందుతున్న ఈ భారీ ప్రాజెక్టు వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ పాత్రకు ప్రాధాన్యం ఎక్కువగా ఉండబోతుందని, ఆమె గ్లామర్‌కు తోడు నటనకూ మంచి అవకాశం లభించిందని చిత్రబృందం చెబుతోంది. ఈ సినిమా విజయం అఖిల్‌కే కాకుండా భాగ్యశ్రీకి కూడా కీలకమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అఖిల్‌కు ఇది కెరీర్‌లో మలుపుతిప్పే అవకాశమైతే, భాగ్యశ్రీకి ఇది స్టార్ స్థాయికి తీసుకెళ్లే వేదికగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. సరైన కథ, భావోద్వేగాలు, సంగీతం కలిసొస్తే ఈ జోడీ వెండితెరపై మాయ చేయగలదని అభిమానులు ఆశిస్తున్నారు. అందం, ప్రతిభ ఉన్నా సరైన సమయంలో సరైన విజయం రాకపోతే గుర్తింపు దక్కదనే నిజం చిత్రరంగంలో తరచూ వినిపిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో భాగ్యశ్రీకి "లెనిన్" చిత్రం అదృష్టాన్ని తీసుకురావాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. ఈ వేసవిలో ఈ జోడీ ప్రేక్షకులను ఎంతవరకు మెప్పిస్తుందో చూడాలి. విజయమే ఆమెకు ఎదురుచూస్తుందా లేదా అన్నది విడుదల తర్వాతే తేలనుంది.

# సమ్మర్ రేసులో తిరువీర్..

**– ఏప్రిల్ 10న థియేటర్లలోకి 'పాపం ప్రతాప్'**

**వేద న్యూస్ డెస్క్:**





టాలీవుడ్ వెర్సటైల్ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం పాపం ప్రతాప్ సమ్మర్ రేసులోకి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమైంది. 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' తర్వాత తిరువీర్ నటిస్తున్న సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్ర బృందం ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. ఏప్రిల్ 10న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుందని వెల్లడించింది. ఈ సందర్భంగా తిరువీర్ సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రతి పాత్ర మనకు ఏదో ఒకటి నేర్పిస్తుందని, 'ప్రతాప్' పాత్ర తనకు అమాయకత్వం, ప్రేమ, బలం వంటి విలువలను నేర్పిందని తెలిపారు. ఈ పాత్రను ప్రేక్షకుల ముం దుకు తీసుకురావడం పట్ల ఎంతో ఉత్సాహంగా ఉన్నానని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. రూరల్ డ్రామా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి ఎస్.పీ దుర్గ నరేష్ దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాతలుగా రాకేష్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మాదిరెడ్డి వ్యవ హరిస్తున్నారు. ఈ చిత్రంలో పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటి స్తోంది. గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాలతో కూడిన కథగా రూపొందుతున్న 'పాపం ప్రతాప్' సమ్మర్ సీజన్‌లో ప్రేక్షకులను ఎంత మేర ఆకట్టుకుంటుందో చూడాలి.

# 'ఉస్తాద్ భగత్‌సింగ్'పై భారీ హైప్..

**– ఓటీటీ డీల్ ఏకంగా రూ.80 కోట్లా?**

**వేద న్యూస్ డెస్క్:**




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా అంటేనే అభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహం నెలకొంటుంది. ముఖ్యంగా గబ్బర్ సింగ్ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు హరీష్ శంకర్‌తో మళ్లీ చేతులు కలపడంతో ఉస్తాద్ భగత్ సింగ్‌పై ప్రారంభం నుంచే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మార్చి 26, 2026న ప్రేక్షకుల ముందుకు రానుండగా, విడుదలకు ముందే వ్యాపార పరంగా రికార్డు స్థాయి ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. పవన్ శైలికి తగ్గ మాస్ అంశాలు, భావోద్వేగ నాటకంతో హరీష్ శంకర్ కథను మలిచినట్లు సమాచారం. సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. గతంలో 'జల్సా', 'అత్తారింటికి దారేది', 'గబ్బర్ సింగ్' వంటి చిత్రాలకు ఆయన అందించిన ఆల్బమ్‌లు విశేష ఆదరణ పొందిన నేపథ్యంలో ఈసారి కూడా పాటలపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రచారంలో భాగంగా విడుదలైన 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాట సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతుండగా, 'దేఖ్‌లేంగే సాలా' పాటకూ మంచి స్పందన లభించింది. ఇంకా రెండు పాటలు విడుదల కావాల్సి ఉండగా, మార్చి రెండో వారంలో ట్రైలర్ విడుదలకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. డిజిటల్ హక్కుల విషయంలో ఈ చిత్రం భారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రముఖ వేదిక నెట్‌ఫ్లిక్స్ సుమారు రూ.80 కోట్లకు ఓటీటీ హక్కులను సొంతం చేసుకున్నట్లు ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. పవన్ గత చిత్రం 'ఓజీ'కు ఓటీటీలో మంచి ఆదరణ లభించిన నేపథ్యంలో ఈ ఒప్పందం సులభంగా పూర్తైందని అంటున్నారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. థియేట్రికల్ వ్యాపార పరంగా కూడా చిత్రం మంచి మార్కెట్ సాధిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రాల వారీగా పంపిణీ హక్కులపై చర్చలు కొనసాగుతుండగా, విదేశీ హక్కుల వ్యవహారం కూడా తుదిదశకు చేరుకున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. విడుదలకు ముందే ఈ స్థాయి హైప్ సృష్టించిన 'ఉస్తాద్ భగత్‌సింగ్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం నమోదు చేస్తుందో చూడాల్సి ఉంది.

# గ్లామర్ ఉన్నప్పుడే జాగ్రత్త.. తమన్నా హెచ్చరిక

**వేద న్యూస్ డెస్క్:**



సినిమా రంగుల ప్రపంచం బయటికి ఎంతో ఆకర్షణీయంగా కనిపించినా, వెలుగుల వెనుక ఎన్నో సవాళ్లు దాగి ఉంటాయని హెచ్చరిస్తోంది ప్రముఖ కథానాయిక తమన్నా భాటియా. అందం, అభినయం మాత్రమే కాదు, ఆర్థిక క్రమశిక్షణ కూడా జీవితాన్ని నిలబెడుతుందని ఆమె స్పష్టంగా వెల్లడించింది. అవకాశాలు ఉన్నప్పుడే భవిష్యత్తు కోసం సిద్ధం కాకపోతే తర్వాత కష్టాలు తప్పవని చెప్పి సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇరవై ఏళ్లకు పైగా చిత్రరంగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆమె ప్రయాణం సులభం కాదు. చిన్న వయసులోనే రంగప్రవేశం చేసి, క్రమంగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఎన్నో విజయాలు, కొన్ని పరాజయాలు ఎదురైనా తన స్థానం కోల్పోకుండా ముందుకు సాగింది. ఈ విజయాల వెనుక కేవలం గ్లామర్ లేదని, పక్కా ప్రణాళిక ఉందని ఆమె వెల్లడించింది. నటీనటుల జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదని, ఆదాయం ఎప్పుడు తగ్గిపోతుందో తెలియదని, అందుకే చేతిలో సంపాదన ఉన్నప్పుడే దూరదృష్టితో ఆలోచించాలని సూచించింది. తన పదిహేనవ ఏట నుంచే ఆర్థిక వ్యవహారాలను కుటుంబం పర్యవేక్షించిందని, ముఖ్యంగా తన తండ్రి మార్గనిర్దేశం తనకు బలమైందని ఆమె తెలిపింది. సంపాదించిన ప్రతి రూపాయిని విలువైనదిగా భావించి, పొదుపు చేయడం, సరైన చోట పెట్టుబడి పెట్టడం నేర్పించారని చెప్పింది. ఇదే క్రమశిక్షణ తనను ఈరోజు ఆర్థికంగా బలంగా నిలబెట్టిందని పేర్కొంది. కళాకారుల కెరీర్ శాశ్వతం కాదని, అందుకే ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను సృష్టించుకోవాలని ఆమె సూచించింది. సినిమాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని కేవలం దాచుకోకుండా, స్థిరాస్తి రంగం మరియు నగల వ్యాపారంలో పెట్టుబడిగా మళ్లించిందని తెలిపింది. ప్రస్తుతం స్వంతంగా నగల వ్యాపారం నిర్వహిస్తూ, ఇతర రంగాల్లోనూ అవకాశాలు అన్వేషిస్తోంది. గ్లామర్ ఉన్నప్పుడే జాగ్రత్త పడాలని, లేకపోతే తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని ఆమె సహచరులకు హెచ్చరించింది. ఆమె మాటల్లో ఆత్మవిశ్వాసం మాత్రమే కాదు, అనుభవం కూడా ప్రతిఫలించింది. వృత్తిపరంగా కూడా ఆమె వేగం తగ్గలేదు. ఈ ఏడాది ఆమె పలు భారీ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి నటించిన "వివాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్" అనే చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతుండగా, అజయ్ దేవగణ్ మరియు సంజయ్ దత్లతో కలిసి "రేంజర్" చిత్రంలో కీలక పాత్ర పోషిస్తోంది. విభిన్న పాత్రలు ఎంచుకుంటూ తన ప్రతిభను మరోసారి చాటేందుకు సిద్ధమవుతోంది. తమన్నా చెప్పిన మాటలు కేవలం చిత్రరంగానికే పరిమితం కావు. ప్రతి రంగంలో ఉన్నవారికీ అవి వర్తిస్తాయి. సంపాదన ఉన్నప్పుడు పొదుపు చేయడం, దూరదృష్టితో నిర్ణయాలు తీసుకోవడం, భవిష్యత్తు కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవడం ఎంత ముఖ్యమో ఆమె ప్రయాణం స్పష్టంగా తెలియజేస్తోంది. వెలుగుల మధ్య జీవించినా, నేలపై నిలబడే గుణమే నిజమైన విజయానికి కారణమని ఆమె ఉదాహరణ మరోసారి నిరూపిస్తోంది.

వేద న్యూస్

శనివారం ఫిబ్రవరి 28, 2026

## జమ్మూకశ్మీర్ బౌలర్‌పై గంగూలీ ప్రశంసలు



**వేద న్యూస్ డెస్క్:**

జమ్మూకశ్మీర్ బౌలర్ ఆకిబ్ నబీ తన అద్భుతమైన స్పీడ్ బౌలింగ్‌తో రనర్స్‌ను రఫాడిస్తూ క్రికెట్ ప్రస్థానంలో తన గుర్తింపును సృష్టించాడు. ప్రస్తుత రంజీ ట్రోఫీ సీజన్‌లో అతను ఇప్పటికే 60 వికెట్లు సాధించడం విశేషం. తాజాగా హుబ్లీలో కర్నాటకతో జరిగిన ఫైనల్స్‌లో, తొలి ఇన్నింగ్స్‌లోనే ఆకిబ్ నబీ అయిదు వికెట్లు తీయడం ద్వారా తన సామర్థ్యాన్ని చాటాడు. టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, ఆకిబ్ నబీ ప్రదర్శనను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో అతను భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉన్నదని తెలిపారు. గంగూలీ తన సోషల్ మీడియా అకౌంట్‌లో వ్యక్తపడి, కర్నాటకను తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌట్ చేయడంలో నబీ కీలక పాత్ర పోషించాడని, జమ్మూకశ్మీర్ క్రికెట్ జట్టు తమ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచిందని వివరించారు. ముఖ్యంగా, హుబ్లీలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో నాలుగో రోజున కర్నాటక 93.3 ఓవర్లలో 293 పరుగులకే ఆలౌటైపోయింది. గంగూలీ, ప్రదర్శనలో ప్రాణం, ఉత్సాహం ఉంటే జమ్మూకశ్మీర్ ఎలా ప్రపంచానికి సవాలు చేస్తుందో ఆకిబ్ నబీ ద్వారా స్పష్టమయిందని అభిప్రాయపడ్డారు. ఈ విజయంతో జమ్మూకశ్మీర్ క్రికెట్ ప్రాంతం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది.

## రెండో మ్యాచ్‌లోనూ భారత్ ఓటమి.. సిరీస్ ఆసీస్‌దే




**వేద న్యూస్ డెస్క్:**

మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా హోబర్ట్ వేదికగా భారత్ -ఆస్ట్రేలియా మహిళా జట్లు రెండో మ్యాచ్‌లో తలపడ్డాయి. ఈ పోరులో ఆసీస్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలి వన్డేలోనూ గెలుపొందిన ఆసీస్ ఇప్పటికే మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. భారత్ నిర్దేశించిన 252 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 36.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆసీస్ బ్యాటర్ జార్జియా వాల్ 82 బంతుల్లో 101 పరుగులు చేసి 13 ఫోర్లు, 1 సిక్స్‌తో సెంచరీతో చెలరేగింది. ఓపెనర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 80 పరుగుల అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును ముందుకు నడిపించింది. బెత్ మూనీ 31 పరుగులు చేసినా, కెప్టెన్ అలీసా హీలీ 6, సదర్లాండ్ 10 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచారు. ఆష్లీ గార్డ్‌నర్ 19లి, మెక్‌గ్రాత్ 0లి నాటౌట్‌గా నిలిచారు. భారత బౌలర్లలో కాష్వీ గౌతమ్ 2, దీప్తి శర్మ 2, క్రాంతి గౌడ్ 1 వికెట్ పడగొట్టారు. తనత తీరా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. గాయం తర్వాత రీఎంట్రీ ఇచ్చిన ప్రతీకా రావల్ 52 పరుగుల హాఫ్ సెంచరీతో మెరిసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 54, స్మృతి మంధాన 31, రిచా ఘోష్ 22, కాష్వీ గౌతమ్ 25 పరుగులు చేశారు. జెమీమా రోడ్రిగ్స్ 11, దీప్తి శర్మ 1, అమన్‌జ్యోత్ 13 విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో ఆష్లీ గార్డ్‌నర్ 2, సదర్లాండ్ 2, అలాన్ కింగ్ 2, మెగాన్ 1, కేరీ 1 వికెట్ పడగొట్టారు. ఈ ఫలితంతో ఆసీస్ మహిళా జట్టు సిరీస్ గెలుపులో ముందంజలో నిలిచింది, భారత్ జట్టు మరో మ్యాచ్‌లో ప్రదర్శన మెరుగుపరచక తప్పదు.

## అభిషేక్ ఫామ్ అందుకోవడానికి కారణం అదే!




**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచ కప్ సూపర్ 8లో భారత జట్టు జింబాబ్వేపై ఘన విజయం సాధిస్తూ క్రికెట్ అభిమానులను ఉత్సాహపరిచింది. 72 పరుగుల తేడాతో గెలిచిన భారత్ సెమీస్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. ఈ విజయంలో క్రీడాకారుల కచ్చిత వ్యూహం, లెఫ్ట్-రైట్ బ్యాటింగ్ కాంబినేషన్, మరియు అభిషేక్ శర్మ ఫామ్ రీబోస్ట్ ప్రధానంగా ప్రభావం చూపాయి. గత నాలుగు ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్-అభిషేక్ శర్మల ఓపెనింగ్ జోడీ విఫలమవడమే టీమిండియాను సమస్యలో పడింది. భారత్ ఈ సమస్యను అధిగమించడానికి సాహసోపేత నిర్ణయం తీసుకుంది. రింకూ సింగ్ స్థానంలో సంజు శాంసన్‌ను ఓపెనింగ్‌కు పంపడం ద్వారా లెఫ్ట్-రైట్ కాంబినేషన్ వ్యూహాన్ని అమలు చేశారు. ఫలితంగా, అభిషేక్ శర్మ 30 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లు చేసి 55 పరుగులు సాధించగా, సంజు శాంసన్ 15 బంతుల్లో 24 పరుగులు సాధించి జట్టుకు మంచి ఆరంభాన్ని అందించాడు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యం కట్టడంతో జట్టు స్థిరంగా ఉన్నది. ఈ లెఫ్ట్-రైట్ కాంబినేషన్ వ్యూహం, పవర్ ప్లేలో స్పిన్నర్లపై చెక్ పెడుతూ జట్టుకు విజయానికి మార్గం సుగమం చేసింది. ఈ వ్యూహం ఫలితంగా టీమిండియా 256 పరుగుల భారీ స్కోరు సాధించి, జింబాబ్వేపై ఆధిపత్యం చూపింది. లీగ్ స్టేజ్‌లో సౌతాఫ్రికాపై ఓడిన తర్వాత జట్టు మళ్లీ స్థిరమైన రిథమ్‌లోకి చేరింది. ఆదివారం కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌తో ఎదురైన మ్యాచ్‌లో విజయం సాధించి సెమీస్‌లో అర్హత సాధించడం ప్రధాన లక్ష్యంగా ఉంది. మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ ఈ విజయాన్ని ప్రశంసిస్తూ, "కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో టీమిండియా సత్తా చాటింది. జింబాబ్వేపై అద్భుత ప్రదర్శన చేశారు. ఈ రిథమ్‌ను కొనసాగిస్తే సెమీస్‌లో మంచి అవకాశాలు ఉన్నాయి" అని అభిప్రాయపడ్డారు. భారత్ జట్టు సాహసోపేత వ్యూహంతో, ఫామ్ రీబోస్ట్ మరియు క్రీడాకారుల కచ్చిత ప్రదర్శనతో, టీ20 ప్రపంచ కప్ సూపర్ 8లో ఫ్యాన్స్‌కు గొప్ప స్ఫూర్తి అందిస్తోంది. మద్దతు చెబుతున్న అభిమానులు జట్టుకు వర్క్‌రేట్‌లో కొనసాగిస్తూ సెమీస్‌లో విజయం సాధించాలని ఆశిస్తున్నారు.

## సంజుకు సునీల్ గవాస్కర్ మద్దతు




**వేద న్యూస్ డెస్క్:**

చెన్నైలోని ఎం.ఎ. చిదంబరం స్టేడియం వేదికగా జింబాబ్వేపై జరిగిన టీ20 వరల్డ్ కప్ సూపర్ 8 పోరులో టీమిండియా అద్భుత విజయం సాధించింది. భారత జట్టు 256 పరుగుల భారీ స్కోరు సాధిస్తూ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టింది. బ్యాటర్లు సమిష్టిగా రాణించి జట్టును గెలుపు తీరాలకు చేర్చారు. సంజు శాంసన్ మెరుపులు వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ ఈ మ్యాచ్‌లో తక్కువ ఇన్నింగ్స్ ఆడినా ప్రభావవంతమైన ప్రదర్శన ఇచ్చాడు. కేవలం 15 బంతుల్లో 24 పరుగులు చేసి స్కోరు వేగాన్ని పెంచాడు. అభిషేక్ శర్మతో కలసి రెండో వికెట్‌కు 48 పరుగుల కీలక భాగస్వామ్యం నిర్మించాడు. అయితే, వేగంగా ఆడే ప్రయత్నంలో ఔటైన సంజు శాంసన్‌కు టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ మద్దతుగా నిలిచాడు. గవాస్కర్ మాట్లాడుతూ, "పవర్ ప్లేలో ఫీల్డింగ్ నిబంధనల ప్రయోజనం పొందే క్రమంలోనే సంజు ఔటయ్యాడు. అతన్ని నిందించలేము. ఈ ఇన్నింగ్స్‌లో అతను తన మార్క్ చూపించాడు" అన్నారు. సెమీస్ అవకాశాలపై ప్రభావం ఆదివారం వెస్ట్ ఇండీస్‌తో జరగబోయే మ్యాచ్‌లో వర్షం పడితే ఫలితం నెట్ రన్ రేట్ ఆధారంగా నిర్ణయించబడుతుంది. జింబాబ్వేపై తక్కువ స్కోరు కోసం బౌలర్లు కట్టడి చేయకపోవడం జట్టుకు శాపంగా మారే అవకాశం ఉందని గవాస్కర్ హెచ్చరించారు. అర్ష్‌దీప్ సింగ్ మినహా మిగిలిన బౌలర్ల ప్రదర్శనలోనూ ఆందోళన ఉన్నట్లు ఆయన తెలిపారు.

## టీమిండియా కీలక పోరులో సత్తా చాటింది: సచిన్ టెండూల్కర్



**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ సూపర్ 8లో జింబాబ్వేతో జరిగిన కీలక పోరులో టీమిండియా 72 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో జట్టు సెమీస్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. మొదటి మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై ఓటమి ఎదుర్కొన్నప్పటికీ, ఈ విజయం భారత జట్టుకు అత్యంత ప్రాణపాయం. ఈ విజయంపై మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో టీమిండియా సత్తా చాటింది. 256 పరుగుల భారీ స్కోరు చేసి అద్భుత ప్రదర్శన చూపింది. జింబాబ్వేపై అద్భుతంగా ఆడింది. జట్టుకు ఇదే రిథమ్ కొనసాగించాలి. ఈ టోర్నమెంట్‌లో చక్కటి ప్రదర్శన చూపిన జింబాబ్వేకు అభినందనలు" అని సచిన్ అన్నారు. లీగ్ స్టేజీని అజేయంగా ముగించిన టీమిండియా సూపర్ 8లో తొలి మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ జింబాబ్వేతో పోరులో పై చేయి సాధించి సెమీస్ ఆశలను సజీవంగా మార్చుకుంది. ఇప్పుడు ఆదివారం కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టే సెమీస్‌కు అర్హత సాధిస్తుంది. అభిమానులు జట్టును వెస్టిండీస్‌పై కూడా అద్భుత ప్రదర్శన చేసి సెమీస్‌కు దూసుకెళ్లాలని కోరుతున్నారు.

## టీమిండియాపై మరోసారి విషం చిమ్మిన ఆఫ్రిది




**వేద న్యూస్ డెస్క్:**

మన గళం : టీ20 వరల్డ్ కప్ రసవత్తరంగా సాగుతున్నప్పుడు, పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ ఆఫ్రిది భారత జట్టుపై మరొకసారి తీవ్ర విమర్శలు గుప్పించాడు. ఆఫ్రిది అభిప్రాయపడ్డాడు, "టీమిండియా సెమీఫైనల్‌లో కి చేరే అర్హతను ఇప్పటివరకు ప్రదర్శించలేదు. టోర్నీలో భారత్ కేవలం చిన్న జట్లపై మాత్రమే గెలిచింది. కాబట్టి అసలు విజయాలే సాధించలేదని చెప్పడం సరైనది." ఆఫ్రిది తన వ్యాఖ్యల్లో చెప్పారు, భారత్ దక్షిణాఫ్రికా వంటి బలమైన జట్లను ఎదుర్కొన్నప్పుడు పూర్తిగా తేలిపోయిందని. "అమెరికా జట్టుపై సూర్యకుమార్ యాదవ్ ఆడకపోతే పరిస్థితి మరోలా ఉండేది. పాక్‌తో మ్యాచ్‌లోనూ భారత్‌ది అదృష్టం సహాయంతో విజయం సాధించింది," అని ఆయన పేర్కొన్నారు. ఆఫ్రిది ఒకవైపు వెస్టిండీస్ జట్టును ప్రశంసిస్తూ, టోర్నీలో వారు అద్భుత ప్రదర్శన చూపినట్టే అన్నారు. సెమీఫైనల్‌కు చేరుకునే అర్హత కరేబియన్లకే 100 శాతం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు, ఆఫ్రిది వ్యాఖ్యలపై సోషల్ మీడియా భారత అభిమానులు తీవ్రంగా స్పందిస్తున్నారు. వారు ఈ వ్యాఖ్యలను పాక్ జట్టు వైఫల్యాలను దాచుకోవడానికి, భారత్‌పై అసూయతో మాట్లాడుతున్నందుకు విమర్శిస్తున్నారు. మొత్తం సందర్భంలో, ఆఫ్రిది వ్యాఖ్యల వల్ల భారత అభిమానులు సంతాపం వ్యక్తం చేస్తుండగా, టోర్నీపై హీట్ కొనసాగుతోంది. భారత జట్టు, అయితే, తమ తీరును మరింత మెరుగుపరచి, తదుపరి మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలని అభిమానులు కోరుతున్నారు. ఈ అంశంపై క్రికెట్ విశ్లేషకులు కూడా, భారత జట్టు ప్రదర్శనను అంచనా వేస్తూ, టోర్నీలోని కీలక నిర్ణయాలను సమీక్షిస్తున్నారు. టీమిండియా తన వ్యూహాలను మరింత ప్రాబల్యంగా అమలు చేస్తే, ఆఫ్రిది విమర్శలను ఎదుర్కొని సత్తా చాటగలదని అంచనా వేస్తున్నారు.

## స్టంప్స్‌కు బంతి తగిలినా..

### బెయిల్స్ కింద పడలేదు.. రంజీ ఫైనల్లో ఘటన..




**వేద న్యూస్ డెస్క్:**

రంజీ ట్రోఫీ ఫైనల్స్‌లో కర్నాటక మరియు జమ్మూకశ్మీర్ మధ్య ఘర్షణాత్మక పోరు కొనసాగుతుండగా, నాలుగో రోజు ఉత్కంఠభరితమైన సంఘటన చోటుచేసుకుంది. జమ్మూకశ్మీర్ రెండో ఇన్నింగ్స్ ఆడుతున్న సమయంలో ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్ చేసిన బంతి స్టంప్స్‌కు తగిలింది, కానీ ఆశ్చర్యకరంగా బెయిల్స్ కిందపడలేదు. ఈ కారణంగా కంరాన్ ఇక్బాల్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించబడాడు. ఈ సందర్భం మ్యాచ్‌లో క్రికెట్ అభిమానులను కేవలం ఆశ్చర్యపెట్టడమే కాక, జట్టుల ఉత్సాహాన్ని మరింత పెంచింది. ఫస్ట్ ఇన్నింగ్స్ ఆధిక్యం ద్వారా జమ్మూకశ్మీర్ ఇప్పటికే 400 రన్ల పైగా ఆధిక్యంలో ఉంది, కాబట్టి రంజీ ట్రోఫీని తన ఖాతాలో వేసుకునే దిశలో ఉంది. ఈ ఘటన వీడియో రూపంలో కూడా పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో వైరల్ అయింది, క్రికెట్ ప్రేమికులలో చర్చలకు కారణమైంది. మొత్తం దృశ్యం చూస్తే, ఆటగాళ్ల ప్రదర్శన, రంజీ ఫైనల్స్ ఉత్కంఠ, మరియు రన్ల ఆధిక్యం కలిపి జమ్మూకశ్మీర్ విజయం దిశగా సులభంగా అడుగులు వేస్తుందని స్పష్టమవుతోంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073